WANTED

**జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.**

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

**సంప్రదించాల్సిన నెంబర్లు:**
**9492580091**

Facebook.varadhinews

విశ్వ

# వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి:1
సంచిక:43
గురువారం,
17.10.2024



## జమ్ముకశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం

- హాజరైన కాంగ్రెస్ నేతలు రాహుల్, ఖర్గే, ప్రియాంక
- నూతన ప్రభుత్వంలో చేరని కాంగ్రెస్
- బయటి నుంచే మద్దతు కొనసాగింపు

**వారధి న్యూస్, శ్రీనగర్:**
జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ లీడర్ ఒమర్ అబ్దుల్లా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్ముకశ్మీర్‌కు తొలి సీఎం అయ్యారు. శ్రీనగర్‌లోని షేర్ఇ కశ్మీర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఒమర్ అబ్దుల్లాతో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, పీడీపీ అధినేత్రి

2 లో

## హైడ్రాకు ఫుల్ పవర్స్..

- కూల్చివేతలపై ఇక తగ్గేదేలే
- హైడ్రాను రద్దు చేయడం కుదరదు
- సంస్థ ఏర్పాటును తప్పుబట్టలేం
- అక్రమ నిర్మాణాలను కూల్చే అధికారం ఉంది
- హైకోర్టు సంచలన వ్యాఖ్యలు



2 లో

# కౌన్ బనేగా మినిస్టర్..!



- మంత్రి వర్గ విస్తరణపై ఆశలు
- రేసులో పలువురు కీలక నేతలు
- సీఎం ఢిల్లీ పర్యటనతో ఆశలు
- అధిష్ఠానం వద్ద పలువురి లాబీయింగ్
- నలుగురికి అవకాశం దక్కే చాన్స్
- ఉత్తర తెలంగాణకు అధిక ప్రాధాన్యం

*గత డిసెంబరులో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ఆ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మరో 11 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ త్వరాత మంత్రి వర్గ విస్తరణ త్వరలో జరుగుతుందని గత కొన్ని నెలలుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ జమ్మూ కశ్మీర్, హర్యానా ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు ఎన్నికల బిజీలో ఉండిపోయారు. దాంతో వారు రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణను పెద్దగా పట్టించుకోలేదు. అయితే ఆ రాష్ట్రాల ఎన్నికలు పూర్తవడంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. ఇటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సహా ముఖ్య నేతలు కూడా ఢిల్లీ వెళుతుండటంతో కేబినెట్ విస్తరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. CWC సమావేశంలో పాల్గొననున్న రేవంత్‌రెడ్డి.. కేబినెట్ విస్తరణపై హైకమాండ్‌తో చర్చించనున్నట్లు తెలుస్తోంది. మరో నలుగురికి కేబినెట్‌లో అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోందని ఈసారి విస్తరణలో ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం ఊపందుకుంది. దీంతో కేబినెట్ విస్తరణపై ఆశావహుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. తాజాగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలతో కేబినెట్ విస్తరణ ఇక ఎంతో దూరంలో లేదన్నది స్పష్టమైంది.*

**వారధి, స్టేట్ బ్యూరో:**
కేబినెట్ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలతో ఆశావహులు అలర్టయ్యారు. మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు ప్రచారం జరుగుతుండడంతో వారి ప్రయత్నాలు మరింత ముమ్మరం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సీనియర్ నాయకుడు ప్రేమ్ సాగర్ రావుతో పాటు, వివేక్, వినోద్ సోదరులు రేసులో ఉన్నారు. దీంతో ముందే వారికి చెక్ పెట్టేందుకు సీనియర్ కాంగ్రెస్ నేతగా మంత్రి పదవి ఆశిస్తున్నానని మీడియా ముందు కుండబద్దలు కొట్టారు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు. అయితే మంత్రి పదవి ఎవరికివ్వాలనేది అధిష్ఠానం చూసుకుంటుందని హైకమాండ్‌పై తన విధేయతను కూడా తెలియజేశారు.

ఇటు ప్రేమ్ సాగర్ రావుకి కౌంటర్‌గా వివేక్, వినోద్ సోదరులు ఢిల్లీ స్థాయిలో మంత్రి పదవి కోసం ఎవరికి వారు లాబీయింగ్ చేస్తున్నారు. ఇప్పటికే వివేక్ తనయుడికి పెద్దపల్లి ఎంపీగా అవకాశం రావడంతో కాకా ఫ్యామిలీ కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని వినోద్ నేరుగా సోనియాగాంధీ స్థాయిలోనే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తనని కాకా ఫ్యామిలీ కోటాలో పరిగణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల కాకా వెంకటస్వామి జయంతి వేడుకలో చెప్పటం.. అయితే మంత్రి వర్గ విస్తరణలో కాకా ఫ్యామిలీ కోటా అయిపోయిందని సీఎం రేవంత్ చమత్కరించడం జరిగింది.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి గెలిచిన సీనియర్ నాయకుల్లో మాజీ మంత్రి ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మంత్రి వర్గవిస్తరణలో ముందు వరుసలో ఉన్నారు. ఈ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలలో సుదర్శన్ రెడ్డి సీనియర్ కావడంతో పాటు వై.యస్ హయాంలోనే మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండటంతో ఆయనకు పోటీ పెద్దగా లేకపోవడం కలిసి వస్తోంది. మొత్తానికి ఈ సారి కేబినెట్ విస్తరణ జరుగుతుందని బలమైన సంకేతాలు వస్తున్న నేపథ్యంలో అమాత్య యోగం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.



## సొమ్ములు కేంద్రానివి.. సోకులు రాష్ట్ర ప్రభుత్వానివి

- రేవంత్ బీఆర్ఎస్‌ను చూసైనా బుద్ధి తెచ్చుకో
- డాంభికాలు ఇకనైనా ఆపు
- ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు

**వారధి, స్టేట్ బ్యూరో:**
కేంద్ర ప్రభుత్వం అనేక రూపాల్లో రాష్ట్రానికి నిధులు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సోకులు చేస్తోందని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. కేంద్రం నిధులు ఇవ్వకపోతే రాష్ట్ర ప్రభుత్వం వద్ద అదనంగా ఒక్క రూపాయి ఖర్చు

2 లో

## రైతులకు మోదీ దీపావళి గిఫ్ట్

- ఆరు పంటలకు కనీస మద్దతు ధర పెంపు
- గోధుమలు క్వింటాల్‌కు రూ.150 హైక్
- జాబితాలో ఆవాలు, శనగలు, కందులు, కుసుమలు, బార్లీ
- ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు
- కేంద్ర కేబినెట్‌కీలక నిర్ణయాలు



**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**
దీపావళి పండుగకు ముందు దేశంలోని రైతన్నలకు మోదీ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ)..మార్కెటింగ్ సీజన్ 202526 కోసం అన్ని తప్పనిసరి రబీ పంటలకు కనీస మద్దతు ధరల (ఎంఎస్‌పీ) పెంపునకు ఆమోదం తెలిపింది. సాగుదారులకు వారి ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలను అందించడానికి, మార్కెటింగ్ సీజన్ 202526 కోసం కేంద్రం ప్రభుత్వం రబీ పంటల ఎంఎస్‌పీని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కేబినెట్ కమిటీ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ విషయాన్ని ప్రకటించారు. 2014 నుంచి 2025 వరకు ఎంఎస్‌పీలలో భారీ పెరుగుదల చోటుచేసుకుందని చెప్పారు.

రబీ సీజన్ ఆరు పంటలు.. గోధుమ, బార్లీ, శెనగలు, ఆవాలు, కందులు, కుసుమల ఎంఎస్‌పీ ధరలు పెరగనున్నాయి. క్వింటాల్ గోధుమల ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.2,275 నుంచి రూ.2,425కి రూ.150 పెరిగింది. ఆవాలు ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.300 పెరిగి రూ.5,950కి, శెనగల ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.210 పెరిగి రూ.5,650కి చేరింది.

2 లో



## రైతుభరోసా నిధులొస్తున్నాయ్..

- ఒక్కో ఎకరాకు రూ.7500
- త్వరలోనే రైతుల ఖాతాల్లో వేస్తాం
- నెలాఖరుకు రుణమాఫీ కంప్లీట్
- మంత్రి తుమ్మల సంచలన వ్యాఖ్యలు

**వారధి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. త్వరలోనే రైతు భరోసా సాయాన్ని విడుదల చేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అలాగే రూ.2 లక్షల లోపు రుణమాఫీని కూడా ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రూ.2 లక్షలకుపైగా రుణాలున్న రైతులకు వచ్చే నెల నుంచి విడతల వారీగా రుణమాఫీ డబ్బులు జమ చేయనున్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా నిడమనూర్ మార్కెట్ కమిటీ ప్రమాణ

2 లో

## డబ్బు వసూళ్ల కోసమే హైడ్రా..

- పేదల ఇళ్లు కూల్చి.. బిల్డర్లను భయపెడుతున్నారు..
- రేవంత్‌రెడ్డిది అసమర్థ పాలన
- మూసీ సుందరీకరణ వెనుక భారీ స్కాం
- పేదలకు మద్దతుగా బీఆర్ఎస్ పర్యటనలు
- గ్రేటర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్



**వారధి న్యూస్, హైదరాబాద్:**
పేదల ఇళ్లుకూల్చి.. బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టి డబ్బు వసూళ్ల కోసమే రేవంత్ సర్కార్ హైడ్రా తెచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పేదలకు తాము అండగా ఉంటామని, క్షేత్రస్థాయిలో పర్యటించి.. బస్తీలు, కాలనీల్లోని వారి భరోసా కల్పిస్తామన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్‌కు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. 'అక్రమ నిర్మాణమైతే.. నా ఫాంహౌస్‌ను కూల్చేయండి.. ఉన్నవాళ్ల ఇళ్లను కూల్చండి.. తప్పు.. హైడ్రా పేరుతో పేదల ఇళ్లుకూల్చి వారిని రోడ్డుపాలు చేయొద్దు' అని అన్నారు.

**భయపెట్టి డబ్బు వసూళ్లు..**
పేదల ఇళ్లుకూల్చి.. బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టి డబ్బు వసూళ్ల కోసమే రేవంత్ సర్కార్ హైడ్రా తెచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పేదలకు తాము అండగా ఉంటామని, క్షేత్రస్థాయిలో పర్యటించి.. బస్తీలు, కాలనీల్లోని వారి భరోసా కల్పిస్తామన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్‌కు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. 'అక్రమ నిర్మాణమైతే.. నా ఫాంహౌస్‌ను కూల్చేయండి.. ఉన్నవాళ్ల ఇళ్లను

2 లో

## రేవంత్ ఇదేనా మార్పు..


- ఏసీడీపీ నిధుల విడుదలలో నిర్లక్ష్యం
- బతుకమ్మ రెండు చీరలన్నారు.. ఒక్క చీర ఇవ్వలే
- ఇప్పటిదాకా రైతు బంధు జాడే లేదు
- ఆర్ఆర్ఆర్ భూసేకరణలోనూ నిర్లక్ష్యమే
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్‌రావు ఫైర్



**వారధి, స్టేట్ బ్యూరో:**
కాంగ్రెస్ ప్రభుత్వం పై మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ప్రభుత్వం ఏసీడీపీ నిధులను ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రజా పాలన అని గొప్పగా చెప్పిన ప్రభుత్వం, బడ్జెట్ లో పొందుపర్చిన విధంగా ప్రతి శాసన సభ నియోజకవర్గానికి ఏసీడీపీ నిధులు రూ. 5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 6 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు.

**రైతుబంధు జాడలేదు..**
బతుకమ్మ రోజు ఒక్క చీర కాదు రెండు చీరలు ఇస్తామని చెప్పారు. ఒక్కటి కూడా ఇచ్చింది లేదని మండిపడ్డారు. రైతు బంధు రూ. 10 వేలు కాదు, రూ. 15 వేలు ఇస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క రూపాయి రైతుల అకౌంట్స్‌లో వెయ్యలేదని విమర్శించారు. "అధికారంలోకి వచ్చారు కేసీఆర్ కిట్ బంధు పెట్టారు. చెరువులు నిండినా చేప పిల్లలను వదలడం లేదు. చేప పిల్లలు తక్కువ పోయాలని అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు. టెండర్ పిలవలేదు. ముదిరాజ్ లకు, గంగ పుత్రులకు తీవ్రమైన అన్యాయం చేసింది ఈ ప్రభుత్వం. మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇవాళ ఇలాంటి మార్పులు చేస్తోంది"

2 లో



## ఏపీకి వెళ్లిపోండి..!

- ఐఏఎస్‌లకు హైకోర్టు షాక్
- ఎక్కడ అవకాశమిస్తే అక్కడ పనిచేయాల్సిందే
- అధికారులున్నది ప్రజా సేవ కోసమే
- కోర్టుకు రావడం సరికాదు
- కీలక వ్యాఖ్యలు చేసిన న్యాయమూర్తి

**వారధి, స్టేట్ బ్యూరో:**
అనుకున్నదే అయ్యింది. తెలంగాణలోనే పనిచేస్తామంటూ పట్టుబట్టిన ఆ నలుగురు ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ఊహించని సూచనలు అందజేసింది. వెంటనే కేటాయించిన రాష్ట్రాల్లో

2 లో



# జమ్ముకశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం

**తరువాయి భాగం**

మెహబూబా ముఫ్తీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, డీఎంకే ఎంపీ కనిమొళి కరుణానిధి, ఆప్ నేత సంజయ్ సింగ్, ఎన్‌సీపీ ఎంపీ సుప్రీయా సూలే, సీపీఐ నేత రాజా హాజరయ్యారు.

**'అందుకే నూతన ప్రభుత్వంలో చేరడం లేదు'**

ఒమర్ అబ్దుల్లాతో పాటు మరో ఐదుగురు మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ఉపముఖ్యమంత్రిగా సురీంద్ర కుమార్ చౌదరీ బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఆరుగురు నేతలు ఎవరూ ప్రమాణస్వీకారం చేయడం లేదని జమ్ముకశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ తారిఖ్ హమీద్ కర్రా వెల్లడించారు. 'ప్రస్తుతానికి మేం జమ్మూకశ్మీర్‌లోని నూతన ప్రభుత్వంలో చేరడం లేదు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని కాంగ్రెస్ బలంగా డిమాండ్ చేసింది. కానీ, అది ఇంతవరకు అది జరగలేదు. అసంతృప్తిగా ఉన్నాం. ఈ విషయంలో మా పోరాటాన్ని కొనసాగిస్తాం'అని హమీద్ పేర్కొన్నారు.

# హైడ్రాకు ఫుల్ పవర్స్..

- కూల్చివేతలపై ఇక తగ్గేదేలే
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- హైడ్రాను రద్దు చేయడం కుదరదు
- సంస్థ ఏర్పాటును తప్పుబట్టలేం
- అక్రమ నిర్మాణాలను కూల్చే అధికారం ఉంది
- హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

**వారధి, స్టేట్ బ్యూరో:**


హైదరాబాద్ నగరవ్యాప్తంగా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రాకు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. హైడ్రా ఏర్పాటును తప్పుపట్టలేమని.. హైకోర్టు తేల్చి చెప్పింది. అంతేకాకుండా హైడ్రాను ఏర్పాటు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. హైడ్రా ఏర్పాటుకు సంబంధించిన జీవో నెంబర్ 99, హైడ్రా కూల్చివేతలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణ కోసం.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా చట్టానికి విరుద్ధం ఎలా అవుతుందని పిటిషనర్లను ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. చట్ట విరుద్ధంగా హైడ్రా చర్యలు చేపడితే వాటిని ప్రశ్నించే అధికారం ఉంటుంది కానీ.. అసలు హైడ్రా ఏర్పాటునే ఎలా ప్రశ్నిస్తారని హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒకవేళ చట్ట విరుద్ధంగా ప్రైవేటు ఆస్తుల్లోకి చొరబడినా.. లేదా ఆ ఆస్తులను కూల్చివేసినా నష్ట పరిహారం కోరుతూ కింది కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేసుకోవచ్చని పిటిషనర్లకు హితవు పలికింది. అంతే కాకుండా కూల్చివేతలకు సంబంధించి చట్ట ప్రకారం నోటీసులు జారీ చేసి.. ఆ తర్వాతే చర్యలు తీసుకోవాలని.. తాము ఇచ్చిన ఆదేశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. కోర్టు ఉత్తర్వులకు ఉల్లంఘించి హైడ్రా చర్యలు చేపడితే.. కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరవచ్చని పిటిషనర్లకు తెలిపింది.

**29కి విచారణ వాయిదా**

హైడ్రాను రద్దు చేయాలని హైదరాబాద్ నానక్‌రాంగూడకు చెందిన లక్ష్మి, మల్కాజిగిరికి చెందిన ఎండీ అహ్మద్ అజీమ్‌లు.. హైకోర్టులో వేర్వేరుగా సవాల్ చేశారు. ఈ పిటిషన్‌లపై విచారణ చేపట్టిన జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి.. ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక పిటిషనర్ల తరపున లాయర్లు సుధాకర్‌రెడ్డి, విజయలక్ష్మి వాదనలు వినిపించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. ప్రైవేటు స్థలంలో నిర్మాణాలను హైడ్రా కూల్చివేసినట్లు కోర్టుకు విన్నవించారు. భూ ఆక్రమణల చట్టం కింద చర్యలు తీసుకునే పరిధి హైడ్రాకు లేదని తెలిపారు. జీహెచ్ఎంసీ చేపట్టాల్సిన చర్యలను హైడ్రా తీసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇక ప్రభుత్వం తరఫున.. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. చట్టప్రకారం నోటీసులు జారీ చేసి ఆ తర్వాతే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇరుపక్షాల వాదనలను విన్న జడ్జి జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి.. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించారు. అదే సమయంలో విచారణను ఈనెల 29వ తేదీకి వాయిదా వేశారు.

**హైడ్రాకు మరిన్ని అధికారాలు**

హైడ్రాకు మరిన్ని అధికారాలు కట్టబెడుతూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి జీహెచ్ఎంసీ ఆస్తులను కూడా హైడ్రా పరిరక్షించనుంది. జీహెచ్ఎంసీకి చెందిన రోడ్లు, డ్రైనేజీలు, నీటి వనరులు, బహిరంగ ప్రదేశాలు, పబ్లిక్ పార్కులు సహా వివిధ ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా రక్షించడానికి హైడ్రాకు రేవంత్ రెడ్డి సర్కార్ అధికారాలు కట్టబెట్టింది.





# ఏపీకి వెళ్లిపోండి..!

**తరువాయి భాగం**

రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ క్యాడర్ ఐఏఎస్‌లు క్యాట్ ఆదేశాలపై బుధవారం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆమ్రపాలి, వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, వాణీప్రసాద్‌ల లంచ్‌మోషన్ పిటిషన్‌ను అనుమతించిన కోర్టు మధ్యాహ్నం విచారణ జరిపింది. దాదాపు 2 గంటల విచారణ తర్వాత తీర్పును రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అంతేకాకుండా సదరు అధికారులు తమకు కేంద్రం (డిఓపీటీ) డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఆదేశాల ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే రిపోర్ట్ చేయాలని సూచనలు ఇచ్చింది.

**కోర్టుకు రావడం సరికాదు...**

మీ అభ్యర్థనపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ అనుకూలమైన తీర్పు ఇవ్వకపోతే కోర్టుకు రావటం సరికాదని తెలిపింది. ఒకవేళ మీ పిటీషన్ డిస్మిస్ చేస్తే మళ్లీ కోర్టుకే వస్తారని, పనిచేసేందుకు ఎక్కడ అవకాశం కల్పిస్తే అక్కడకు వెళ్లి పనిచేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. వీటిపై విచారణ తర్వాత చేస్తామని తెగేసి చెప్పేసింది. ఫలితంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో అఖిల భారత సర్వీస్ అధికారుల కేటాయింపులపై డీఓపీటీ ఆదేశాలకు అనుగుణంగా అలాటెడ్ రాష్ట్రాల్లో రిపోర్టు చేయాల్సిన తప్పని పరిస్థితి నెలకొంది. రొనాల్డ్‌రోస్, శివశంకర్, హరికిరణ్, ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్ డీఓపీటీ ఉత్తర్వులపై తెలంగాణ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జస్టిస్ అభినంద్ కుమార్ శావిలి బెంచ్ పిటిషన్లను విచారించింది. కేంద్రం తరఫున న్యాయవాది వాదిస్తూ ఏ అధికారి ఎక్కడ పని చేయాలో చెప్పే అధికారం కోర్టుకు లేదన్నారు. సివిల్ సర్వీస్ అధికారులు పూర్తిగా కేంద్రం ఆధీనంలో పనిచేస్తారని, ఈ మేరకు కేంద్రంలోని సీనియర్ అధికారులే వీరి పోస్టింగ్‌లపై నిర్ణయాలు తీసుకుంటారన్నారు. విచారణ సమయంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అధికారులు ప్రజా సేవ కోసమే ఉన్నారని, ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడే పనిచేయాలని సూచించింది.

**రిలీవ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం..**

ఆరుగురు ఏపీ క్యాడర్ ఐఏఎస్‌లను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఐఏఎస్ అధికారులు.. రొనాల్డ్ రోస్, ప్రశాంతి, ఆమ్రపాలి, విశాలాక్షి, వాణీ ప్రసాద్, వాకాటి కరుణలను ప్రభుత్వం రిలీవ్ చేసింది. రిలీవ్ అయిన ఐఏఎస్‌ల స్థానాల్లో ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి స్థానంలో రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ కె.ఇలంబర్తికి అదనపు బాధ్యతలు అప్పగించింది. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎస్.శ్రీధర్‌కు, విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియాకు, మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శిగా టి.కె.శ్రీదేవికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

# సొమ్ములు కేంద్రానివి.. సోకులు రాష్ట్ర ప్రభుత్వానివి



**తరువాయి భాగం**

చేసే స్తోమత లేదని విమర్శించారు. ఈ విషయం అంగీకరించకుండా కాంగ్రెస్ నేతలు బీజేపీ ఎంపీలపై ఆడిపోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణకు అన్ని విధాలుగా సహకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం వాలకం చూస్తే బాధగా ఉందని అన్నారు. కేంద్రం నిధులు ఇవ్వడం లేదని దుమ్మెత్తిపోస్తున్నారని, ఇంతకీ వీళ్లకు అవగాహన ఉందా లేదా అని ప్రశ్నించారు.

నేనూ ఆర్థిక మంత్రిగా పని చేశానని, కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ కూడా ఓ రాష్ట్రానికి ప్రాధాన్యత మరో రాష్ట్రానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వదని అన్నారు. కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, నితిన్ గడ్కరీతో భేటీ అయిన వివరాలను ఆయన వెల్లడిస్తూ ఎఫ్ఆర్‌బీఎం రుణాలు 50 శాతం దాటాయని అన్నారు. సీఎస్ఎస్ పథకాల్లో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 40 శాతం నిధులు జమ చేయకపోవడం వల్లే కేంద్రం నుంచి వచ్చే నిధులు సకాలంలో రావడం లేదని తెలిపారు. అంతే తప్ప బట్టకాల్చి మీద వేయడం సరి కాదని చెప్పారు.

**రేవంత్ సర్కార్ కొత్తగా చేస్తున్నదేమి లేదు**

రాష్ట్రంలో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ ఉన్నాయని, వాటన్నింటిని ఒక్కటి చేయడం తప్పా రేవంత్ రెడ్డి సర్కార్ కొత్తగా చేస్తున్నదేమి లేదని ఈటల రాజేందర్ అన్నారు. ఉన్న స్కూళ్లను మూసి వేయకుండా కొత్త భవనాలు, సరిపడా సిబ్బందిని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో కెసిఆర్ ఆర్భాటం చేసి ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రెసిడెన్షియల్ స్కూళ్లకు డైట్ చార్జీలు కూడా చెల్లించలేని దుస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుచేటని విమర్శించారు.

ఇకనైనా రేవంత్ రెడ్డి డాంబికాలు మాట్లాడకుండా నేలమీదకు దిగి వచ్చి పేద పిల్లలు చదువుకునే హాస్టల్స్‌కు అద్దెలు, డైట్ చార్జీలు చెల్లించాలని సూచించారు. సంవత్సరాల పాటు అద్దెలు చెల్లించకుండా హాస్టల్ బిల్డింగ్‌లకు యజమానులు తాళాలు వేస్తే క్రిమినల్ కేసులు వేస్తామంటే ఇంతకంటే వెర్రితనం మరొకటి ఉండదా? అని ఈటల ప్రశ్నించారు. దబాయింపులతో ప్రభుత్వాన్ని ఎప్పుడు నడపలేరన్నారు. ప్రభుత్వం డొల్లతనం అందరికి తెలిసిపోయిందని, మంత్రులు కోపానికి రావొద్దని హితవు పలికారు. గత ప్రభుత్వం కూడా ఇలాగే బెదిరిస్తే వారికి ఏం గతి పట్టిందో అందరం చూశామని అన్నారు. వారిని చూసి కాంగ్రెస్ బుద్ధి తెచ్చుకోకపోతే ఇక వారి ఖర్మ అన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అయిందని కానీ ఇప్పటి వరకు ఎక్కడా కూడా కొత్త కేటాయింపులు లేవని తెలిపారు.

**హైడ్రా చర్యలతో ప్రజల ఆందోళన**

గతంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన 2.40 లక్షల ఇండ్లను బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్మించలేకపోయిందని, నిర్మాణం పూర్తయిన వాటిని కూడా పంపిణీ చేయలేక పోయారని తెలిపారు. అందువల్ల ఈసారి రాష్ట్రంలో ఎక్కువ మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో ఎక్కువ ఇళ్లు ఇవ్వాలని కోరానని అన్నారు. అర్బనైజేషన్ పేరుతో హైదరాబాద్‌లో అనేక చెరువులు మాయం అయ్యాయని, అందువల్ల ఉన్న చెరువులను కాపాడుకునేందుకు చెరువులను విస్తరించి సుందరీకరణ పనులు చేపట్టేందుకు సహకరించాలని కోరినట్లు చెప్పారు. హైడ్రా చర్యలతో అనేక మంది నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో నాల విస్తరణకు నిధులు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.

# రైతుభరోసా నిధులొస్తున్నాయ్..

**తరువాయి భాగం**

స్వీకార కార్యక్రమంలో పాల్గొని ఈమేరకు మాట్లాడారు.

రూ.2 లక్షల లోపు పంట రుణాలున్న రైతులు ఇంకా నాలుగు లక్షల మంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరందరికీ దీపావళికి ముందే సాయం అందజేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఆ తర్వాతే రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణమాఫీని ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు.

ఇక రైతు భరోసా సాయాన్ని రూ. 15 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. రెండు విడతల్లో రూ. 7,500 చొప్పున రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని అందించనుంది. త్వరలోనే ఈ నిధులు కూడా విడుదల చేస్తామని తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఈ నెలాఖరు నాటికి రుణమాఫీతో పాటు రైతు భరోసా నిధుల కూడా విడుదల అయితే రైతులకు దీపావళికి రెండు కానుకలు అందినట్లు అవుతుంది. ఇవి ఎంత వరకు అమలు అవుతాయో చూడాలి. మరోవైపు వరి పంట వేసే రైతులకు క్వింటాల్ కు రూ. 500 బోనస్ కూడా అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపడతామని చెప్పారు.

కాగా రైతు రుణమాఫీ ప్రారంభించి చాలా రోజులు కావస్తోంది. అయినా ఇంకా చాలా మందికి రుణమాఫీ జరగలేదు. దీంతో వీలైనంత త్వరగా రుణమాఫీ పూర్తి చేయాలని రైతుల నుంచి డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. కొందరు రైతులకు సాంకేతిక కారణాలతో రుణమాఫీ నిలిచిపోయింది. ఆధార్, రేషన్ కార్డులో పేర్లు తప్పుగా ఉండటం, బ్యాంకు ఖాతాతో ఆధార్ లింక్ కాకపోవడం వంటి కారణాలతో వేలాది మంది రైతులకు సాయం అందలేదు.



# రైతులకు మోదీ దీపావళి గిఫ్ట్

**తరువాయి భాగం**


ఎంఎస్‌పీ పెరుగుదల ఇలా..

- గోధుమల ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ. 2,425కి పెంచబడింది. ఇది అంతకుముందు రూ. 2,275గా ఉంది. పెరుగుదల రూ. రూ. 150
- బార్లీ ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ. 1,980కి పెంచబడింది. ఇది గతంలో రూ. 1,850గా ఉంది. పెరుగుదల రూ. రూ. 130
- శెనగలు ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ. 5,650కి పెంచబడింది. ఇది గతంలో రూ. 5,440గా ఉంది. పెరుగుదల రూ. రూ. 210
- కందులు ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ. 6,700 కు పెంచబడింది. ఇది గతంలో రూ. 6,425గా ఉంది. పెరుగుదల రూ. రూ. 275
- ఆవాలు ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ. 5,950కి పెంచబడింది. ఇది అంతకుముందు రూ. 5,650గా ఉంది. పెరుగుదల రూ. రూ. 300
- కుసుమలు ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ. 5,940కి పెంచారు. ఇది గతంలో రూ. 5,800గా ఉంది. పెరుగుదల రూ. రూ. 140

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు డీఏ 3 శాతం పెంపు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి ముందు గుడ్ న్యూస్. ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంచుతూ అక్టోబర్ 16న కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. డీఏ పెంపుతో కోటి మందికి పైగా ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. 3 శాతం డీఏ పెంపుతో ఉద్యోగుల డియర్‌నెస్ అలోవెన్స్ (డీఏ) 50 శాతం నుంచి 53 శాతానికి చేరనుంది. పెరుగుతున్న ధరలకు పరిహారంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ ఇస్తారు. ఏడాదికి రెండుసార్లు ప్రభుత్వ ఉద్యోగులకు ,పెన్షనర్లకు డీఏ ఇస్తారు. ఈ ఏడాది మార్చిలో డీఏ 4శాతం పెరిగింది. ఇది జనవరి 2024 నుంచి అమల్లోకి వచ్చింది. మూడు నెలల బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. డీఏ పెంపు ప్రకటన అక్టోబర్ చివరిలో వస్తే.. జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల బకాయిలతో కలుపుకుని జీతం అందుతుంది.పండుగల సీజన్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇది పెద్ద ఊరటనిస్తుంది.

# ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం




**వారధి న్యూస్, సూర్యాపేట:** విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన ధైర్యవంతులైన పోలీసులను స్మరించుకుంటూ అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం మరియు పోలీస్ ఫ్లాగ్ డే జరుపుతామని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా 21వ తేదీ నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని, యువత మరియు విద్యార్థులు అమర పోలీసులకు నివాళి ఘటించాలని సూచించారు.

**కార్యక్రమాలు:**

పోలీస్ ఓపెన్ హౌస్: పోలీస్ విధులు మరియు టెక్నాలజీ ఉపయోగం పై సమావేశం.

రక్తదాన శిబిరం: అత్యవసర సమయంలో బాధితులకు సహాయం అందించడానికి.

అమరవీరుల కుటుంబాల సందర్శన: పోలీసులు అమరులైన వారి కుటుంబాలను సందర్శించడం.

**వ్యాసరచన పోటీలు:**

12వ తరగతి విద్యార్థులకు "విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడకం".

డిగ్రీ తర్వాత విద్యార్థులకు "తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర".

**పోటీల వివరాలు:**

లఘు చిత్రాలు మరియు ఫోటో పోటీలు: పోలీసు త్యాగాలు, విధుల్లో ప్రతిభను ప్రతిబింబించే షార్ట్ ఫిల్మ్స్ మరియు తాజా ఫోటోలు.

సినిమా ప్రదర్శన: పోలీసు ప్రతిభను చూపించే చిత్రాల ప్రదర్శన.

**పాల్గొనే విధానం:** ఆసక్తి గల వారు తమ షార్ట్ ఫిల్మ్స్, తాజా ఫోటోలు, న్యూస్ ఆర్టికల్స్‌ను 27వ తేదీ వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో అందించాలి. వివరాల కొరకు 7013923377ను సంప్రదించాలని ఎస్పీ తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా పోలీసు విధుల పట్ల సామాజిక అవగాహన పెరగడంతో పాటు, అమరవీరులకు అర్హమైన ఘనతను అందించేందుకు కృషి జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.



# డబ్బు వసూళ్ల కోసమే హైడ్రా..

**తరువాయి భాగం**

కూల్చండి.. తప్ప.. హైడ్రా పేరుతో పేదల ఇళ్లుకూల్చి వారిని రోడ్డుపాలు చేయొద్దు' అని అన్నారు.

**రేవంత్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నరు..**

వికారాబాద్ జిల్లాలో రేడార్ స్టేషన్ పనులకు శంకుస్థాపన సందర్భంగా జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డిచేసిన ప్రసంగం ఆశ్చర్యం కలిగించిందని కేటీఆర్ అన్నారు. ఆయన కాంగ్రెస్ ముఖ్యమంత్రేనా? లేక బీజేపీలో ఉన్నారా? అర్థం కావడంలేదన్నారు. ఉన్నట్టుండి ఆయనకు దేశరక్షణ గుర్తొచ్చిందని, గతంలో ఆయన ఆర్మీలో ఏమైనా పని చేశారా? అంటూ ఎద్దేవా చేశారు. రేడార్ స్టేషన్‌తో స్థానికులకు ఒక్క ఉద్యోగం కూడా రాదని.. పర్యావరణానికి నష్టం కలిగించే ఆ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వడం తగదన్నారు. పర్యావరణ హితం కోసమే.. నేవీ రేడార్ స్టేషన్ ఏర్పాటుకు కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలం కేటాయించలేదన్నారు.

**ఇద్దరు ఎమ్మెల్యేలు డుమ్మా..**

ఇదిలా ఉండగా.. కేటీఆర్ నిర్వహించిన సమావేశానికి ఇద్దరు ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరు కాలేదు. మరోవైపు.. అధికారం చేపట్టిన పది నెలల్లోనే రేవంత్‌రెడ్డి.. రికార్డు స్థాయిలో రూ.80,500 కోట్ల అప్పులు చేశారని, ఆ డబ్బులను ఏంచేశారని నిలదీశారు. కొత్తగా సాగునీటి ప్రాజెక్టు కట్టలేదు.. ఎన్నికల హామీలు తీర్చలేదు. తెచ్చిన అప్పు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి.. అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

# రేవంత్ ఇదేనా మార్పు..

**తరువాయి భాగం**

అంటూ మండిపడ్డారు.

**రింగు రోడ్డు భూసేకరణలో నిర్లక్ష్యం**

రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు హరీష్ రావు. తమ హయంలో ఉత్తర, దక్షణ రెండు భాగాలుగా ప్రతిపాదన చేశామని, ఉత్తర భాగం 158 కిలోమీటర్లు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని చెప్పారు. భూసేకరణ కోసం 3ఏ ద్వారా నోటిఫికేషన్లు ఇచ్చినట్టు తెలిపారు. ఖర్చు మాత్రం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం చెరిసగం భరించేలా ప్రతిపాదన ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినా, భూసేకరణ చెయ్యడం లేదని, ఎందుకు ఆలస్యం జరుగుతోందని ప్రశ్నించారు. ఉత్తర భాగంలో యుద్ధ ప్రాతిపదికన మార్కెట్ విలువ ప్రకారం రైతులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. దక్షిణ భాగం అలైన్మెంట్ పూర్తిగా మార్చారని, ప్రభుత్వంలో ఉన్న కొందరి నేతల భూములు ఉన్నందునే అలా జరిగిందని చెప్పారు.

స్వార్థం కోసం అలైన్మెంట్ మార్చడం వల్ల 182 కిలోమీటర్ల నుంచి 198 కిలోమీటర్లకు పెరిగిందని మండిపడ్డారు. పెరిగిన 16 కిలోమీటర్ల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వ నిధులు చేత నిర్మిస్తామని చెప్తున్నారని, దానివల్ల రూ.20 వేల కోట్ల అదనపు భారం పడుతుందని చెప్పారు. ప్రభుత్వంలో ఉన్న కీలక వ్యక్తుల భూముల కోసం రూ. 20 వేల కోట్ల భారం ప్రజలపై వేయడం కరెక్ట్ కాదన్నారు. రుణమాఫీ కోసం అప్పు పుట్టడం లేదని మంత్రి తుమ్మల అంటున్నారని, అలైన్మెంట్ మార్చడం వల్ల రూ. 20 వేల కోట్లు ఎక్కడ నుండి తెస్తారని అడిగారు హరీష్ రావు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com




## వనపర్తి జిల్లాలో విద్యార్థుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వారధి న్యూస్,వనపర్తి:** జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్, గురుకుల పాఠశాలలు, కే.జి.బి.వి విద్యాలయాల్లో 6వ తరగతి నుండి డిగ్రీ వరకు ఖాళీగా ఉన్న విద్యార్థుల సీట్లను స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ద్వారా వెంటనే భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఐ.డి.ఓ.సి సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో, ఎస్సి, ఎస్టీ, బి.సి., మైనారిటీ శాఖలకు సంబంధించి ఉన్నతాధికారులతో కలసి ఖాళీ సీట్లపై నివేదిక తీసుకున్నారు. "నాణ్యమైన విద్యను అందించేందుకు ఉన్నత విద్యా సంస్థల్లో ఖాళీలను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేయాలి" అని ఆయన అన్నారు. ఈ ప్రదేశంలో ఒక ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, సీటు కావాల్సిన విద్యార్థులు అక్కడ సంప్రదించి, సంబంధిత పాఠశాలకు పంపించి స్పాట్ అడ్మిషన్ పొందేలా చూడాలని సూచించారు.అదే విధంగా, విద్యార్థుల ఆరోగ్యం కోసం రక్త హీనత నివారణకు సంబంధించి చర్యలు తీసుకోవాలని మరియు 17 సంవత్సరాలు దాటిన విద్యార్థుల ఓటరు నమోదు కోసం అవసరమైన ఫారం (6) విద్యా సంస్థల్లో పంపించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా వైద్య అధికారి డా. జయచంద్ర మోహన్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి మానిటరింగ్ కమిటీ దట్నూరు, చిల్వకోడూరు గ్రామాలను సందర్శన

**వారధి న్యూస్, జగిత్యాల:**మండలంలోని దట్నూరు మరియు చిల్వకోడూరు గ్రామాలను జాతీయస్థాయి మానిటరింగ్ కమిటీ సందర్శించి, కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలుచేయబడుతున్న పథకాలను పరిశీలించింది.ఈ సందర్శనలో, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్, కంపోస్ట్ షెడ్డు, వైకుంఠధామము, మరియు గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను సమీక్షించారు.సెర్ప్ ద్వారా అమలవుతున్న సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల పథకాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా, గ్రూపు సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ షాపులు, పీఎం ఎఫ్ఎంఈ పథకం ద్వారా ఏర్పాటు చేయబడిన ఫ్లోర్ మిల్లు వంటి వాణిజ్య కార్యకలాపాలను కూడా పరిశీలించారు.మహిళా గ్రూపు సభ్యుల అభిప్రాయాలను సేకరించి, లింకేజీ ద్వారా వచ్చిన నిధులను ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారో తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎల్ ఎం టీం లీడర్ సుబ్రహ్మణ్య రెడ్డి, ఎంపీడీవో రామ్ రెడ్డి, వ్యవసాయ అధికారి సురేష్ రెడ్డి, మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకంలో అనర్హులకు చెక్కుల పంపిణీ

**అధికారులను సస్పెండ్ చేసిన కలెక్టర్**



**వారధి న్యూస్, సూర్యాపేట:** కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకంలో 11 మంది అనర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం పై వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ తేజస్ విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం, సూర్యాపేట ఆర్డీవో మరియు నూతనకల్ తాసిల్దారులు విచారణ నిర్వహించారు. ఫలితంగా, ఆ 11 మంది లబ్ధిదారులు అనర్హులుగా గుర్తించబడ్డారు. ఈ నేపథ్యంలో, తప్పుడు మ్యారేజి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను అందించిన దరిసెనపల్లి పంచాయతీ సెక్రటరీ వెంకట్ రెడ్డి, మిరియాల పంచాయతీ సెక్రటరీ అనిల్ లను కలెక్టర్ సస్పెండ్ చేశారు. అదనపు గిర్దావార్ లక్ష్మీ ప్రసాద్‌ను కూడా విధుల పట్ల నిర్లక్ష్యం చూపినందుకు సస్పెండ్ చేయడం జరిగింది. ప్రభుత్వ పథకాలను సమగ్రంగా అమలు చేయకపోతే, నిర్వాహకుల పై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.


## పెద్దాపూర్‌జంగుపల్లి మధ్య రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి, ఇద్దరు గాయాలు

**వారధి న్యూస్, రామప్ప:**మండలంలోని పెద్దాపూర్‌జంగుపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం ప్రకారం, టీఎస్ 25 బి 1339 నెంబర్ గల హోండా యాక్టివాలో ప్రయాణిస్తున్న పేరాల వెంకటేశ్వరరావు, వేముల మణి ప్రసాద్, జక్కిరాజు జశ్వంత్ పెద్దాపూర్ నుండి జంగుపల్లి మీదుగా భూపాలపల్లికి వెళ్తుండగా, ఏపీ 20 టిబి 6388 నెంబర్ గల లారీ భూపాలపల్లి నుండి ఏటూరునాగారం వైపు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పెద్దాపూర్ జంక్షన్ వద్ద జరిగిన ఈ సంఘటనలో పేరాల వెంకటేశ్వరరావు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, వేముల మణి ప్రసాద్ మరియు జక్కిరాజు జశ్వంత్ తీవ్రంగా గాయపడ్డారు.

## కేశంపేటకు జాతీయ పురస్కారం

- పోలె పోగు జంగయ్యను గవర్నర్ అభినందన




**వారధి న్యూస్, కేశంపేట:**కేశంపేట గ్రామానికి చెందిన పోలె పోగు జంగయ్యకు జాతీయ పురస్కారం దక్కింది. అందులు మరియు వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై బొమ్మల ద్వారా చేసిన సేవలకు ఇది గుర్తింపు. మంగళవారం హైదరాబాదులోని రాజ్ భవన్‌లో గవర్నర్ విష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా జాతీయ వైట్ కెన్ సేఫ్టీ రోజు సందర్భంగా తెలంగాణ నేషనల్ ఆర్టిస్ట్ అవార్డు వికలాంగుల విభాగంలో అందుకున్నారు. జంగయ్య చేసిన సేవలపై గ్రామస్తులు అతన్ని అభినందించారు. వికలాంగుల జీవనశైలిలో మార్పు తెచ్చేందుకు అతడు చేపట్టిన కార్యక్రమాలు సమాజంలో మంచి గుర్తింపు పొందుతున్నాయి.





# ముదిరాజుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కుచుకుళ్ల రాజేశ్వర్ రెడ్డి

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** నాగర్ కర్నూల్ మండలం పెద్ద ముద్దనూరు గ్రామంలో నూతన ముదిరాజ్ సంఘం భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డా. కుచుకుళ్ల రాజేష్ రెడ్డి బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదిరాజులను ప్రభుత్వం రాజకీయంగా, ఆర్థికంగా బలపరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.వారికి అండగా ప్రభుత్వ తరపున నేను ఉన్నానని ఆయన వారికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తరపున వచ్చే పథకాలు, రాయితీలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా, నాణ్యమైన చేప పిల్లల సీడ్ ను పంపిణీ చేసే విధంగా అధికారులు పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు, సంబధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.





### మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు లబ్ధి పొందాలనుకుంటే

## ప్రజాపాలన కేంద్రంలో సంప్రదించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వారధి న్యూస్ , వనపర్తి:** మహాలక్ష్మి మరియు గృహజ్యోతి పథకాల ద్వారా లబ్ధి పొందని వారు ప్రజాపాలన కేంద్రంలో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, "పేద ప్రజలకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ మరియు గృహజ్యోతి పథకం ద్వారా ప్రతి నెల 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించబడుతుంది," అని తెలిపారు. లబ్ధిదారులు తమ సమీప ప్రజాపాలన కేంద్రానికి గ్యాస్ పాస్ పుస్తకం, విద్యుత్ బిల్ వంటి ఆధారాలతో వెళ్లి సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. అన్ని మండల అభివృద్ధి కార్యాలయాల్లో మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన కేంద్రాలు పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, సివిల్ సప్లై అధికారి కాశి విశ్వనాథ్, డి.యం. ఇర్ఫాన్, డి.టి లు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



### నవజాత శిశు మరణాల

## నియంత్రణపై చర్యలు తీసుకోవాలి

- వైద్య ఆరోగ్య శాఖాధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వారధి న్యూస్, వనపర్తి :**జిల్లాలో నవజాత శిశు మరణాల నియంత్రణకు వైద్య శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్యశాఖ అధికారులతో నవజాత శిశు మరణాల పై సమీక్ష నిర్వహించారు. నవజాత శిశు మరణాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్న కలెక్టర్, అందుకు గల కారణాలపై అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంసీహెచ్ లలో నవజాత శిశు మరణాలు చోటుచేసుకోకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల్లో ఎన్ ఐసీయూలను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో అబార్షన్లు ఎక్కడెక్కడ జరుగుతున్నాయి, ఎందుకు జరుగుతున్నాయనే దానిపై ఆడిట్ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అబార్షన్లకు పాల్పడే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి చికిత్సల కోసం ఆప్తాల్మాలజీ విభాగానికి సంబంధించిన ఆపరేషన్ థియేటర్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టీఎస్ఎంఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే క్రిటికల్ కేర్ యూనిట్ విభాగానికి సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఎన్ కాస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్వీసెస్) సర్టిఫికేషన్ పొందడానికి పీ.హెచ్.సి లు అర్హత సాధించే విధంగా సదుపాయాలను మెరుగు పరచాలని సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు వసతి కల్పించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

సమావేశంలో జిల్లా వైద్యశాఖాధికారి జయ చంద్రమోహన్, డిప్యూటీ డీఎంహెచ్ వో, డా .సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ పరిమల, చైతన్య గౌడ్, టీఎస్ఎంఐడీసీ ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.






# ప్రభుత్వ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా పని చేద్దాం

- ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వారధి న్యూస్,ఖిల్లా ఘనపురం :** మండలంలో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పిలుపునిచ్చారు. పండుగొల్ల సాయన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, షాపూర్ గ్రామాన్ని ఆదర్శంగా మార్చడం లక్ష్యంగా పని చేద్దామని పేర్కొన్నారు.గ్రామంలోని ముదిరాజ్ సంఘం సభ్యులు మరియు ప్రజలు ఐక్యతగా పండుగొల్ల సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విశేషంగా ఉన్నదని ఆయన హర్షించారు."ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించడానికి ప్రజలు ఐక్యంగా పని చేయాలి," అని గ్రామస్తులకు సూచించారు.ఈ సందర్భంగా, గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





## రైతులను ఆదుకోనేందుకే కొనుగోలు కేంద్రాలు

- ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తెలిపారు.బుధవారం నాగర్ కర్నూలు నియోజకవర్గం లోని తాడూరు మండలం చర్ల ఇటిక్యాల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గింజలు కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యం చెందకుండా వరి ధాన్యాన్ని కొనుగో లు కేంద్రాలకు తరలించి అమ్ముకోవాలని సూచించారు. సన్న వడ్లకు 500 బోనస్ ప్రకటించిన విధంగానే ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. రైతుల ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అధికారులు రైతులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## నక్ష బాట విస్తరణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**వారధి న్యూస్, షాద్ నగర్:** ఫరూఖ్ నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో నక్ష బాట విస్తరణ పనులను బుధవారం ప్రారంభమయ్యాయి. ఎలికట్ట నుండి సర్దార్ నగర్ వరకు వెళ్లే రోడ్డు పురాతనంగా ఉండి, ప్రజలకు ప్రయాణ సౌలభ్యం లేకుండా ఉంది. రైతులు, ప్రజలు ఈ రోడ్డు బాగుచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరగా, ఆయన అంగీకరించి రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, గ్రామ అధ్యక్షుడు బద్దుల మల్లయ్య, మాజీ సర్పంచులు మోహన్ రెడ్డి, సాయి ప్రసాద్, ఇతర గ్రామ ప్రముఖులు, అధ్యక్షుడు బద్దుల మల్లయ్య, గున్న భీమయ్య, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయి ప్రసాద్,మాజీ ఎంపీటీసీ సభ్యులు కావలి శ్రీశైలం,నారం రాంరెడ్డి, భవానీ మాత దేవాలయ చైర్మన్ ముత్యాల రాజు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ చాకలి చంద్రయ్య, ముదిగొండ సంజీవ,మాజీ వార్డు సభ్యుడు బుడ్డ నర్సింలు, ఆర్ల యాదయ్య, సీమ మల్లయ్య, చౌడపురం భీమయ్య, చాకలి ఇస్తారి, బాల్ రత్నం గౌడ్, చింత కింది వెంకటేష్, ఎండి యూసూఫ్, గడ్డమీది శీను, ఎండి ఆజాం,చాకలి యాదగిరి, ఎండి మార్బుల్, వై శివ, సీమకుమార్ అంబటి భీమయ్య మంకాల యాదయ్య, ఎండి జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ అధికారుల సమక్షంలో గ్రామ సభల ద్వారా కమిటీలను ఏర్పాటు చేయాలి

- వినతి పత్రాలు అందించిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు.....

**వారధి న్యూస్, దేవర్పుల / జనగామ :** జనగామ జిల్లా, దేవరుప్పుల మండలం లోని,కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్ల కమిటీలు గ్రామసభ నిర్వహించకుండా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కమిటీలు నిర్వహించాడం పైన ఈ రోజు బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తీగల దయాకర్ గౌడ్ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండల MRO, MPDO గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు బస్వ మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, PACS వైస్ చైర్మన్ నక్క రమేష్, మాజీ వైస్ MPP కత్తుల విజయ్ కుమార్, AMC మాజీ వైస్ చైర్మన్ అనంతోజు కృష్ణమూర్తి, గండిపల్లి యాకయ్య, AMC డైరెక్టర్ కుతాటి నర్సింహులు, జేరిపోతుల సాయిలు, వంగా అర్జున్, గొడుగు మల్లికార్జున్, కారుపోతుల భిక్షపతి,తటిపల్లి మహేష్, తోటకూరి కిష్టయ్య, లోడంగి వెంకన్న, జోగు ఐలుమల్లు, మేడ విద్యాసాగర్, చింత యాదగిరి, భాషిపాక అబ్బయ్య, చింత సోమయ్య, చింత పర్శరాములు, యువజన నాయకులు గదరి శ్రీకాంత్, ఉప్పుల సామ్రాట్, మండల నాయకులు, యూత్ పాల్గొన్నారు.



## మాలల ఆత్మ గౌరవ సభ గోడ పత్రికలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో :** జిల్లా కేంద్రంలో ఈనెల 27న జడ్పీ హైస్కూల్లో నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభ వాల్ పోస్టర్ లోలను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాల మహానాడు మాల ఉద్యోగుల ఐక్యవేదిక నాయకుల సమక్షంలో బుధవారం విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు

- ఈనెల 22 న నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొ రేషన్ లిమిటెడ్ అవగాహన సదస్సు
- నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** నాగర్ కర్నూల్ కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ మరియు ఎన్జీవోస్ ప్రతినిధులతో బుధవారం సమీక్ష నిర్వహించిన స్థానిక ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్. నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఈనెల 22 న తేదీన నిర్వహించబోయే సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ పై అవగాహన సదస్సుకు సరైన ప్రణాళికలతో సిద్ధం కావాలని స్థానిక ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ నాగర్ కర్నూల్ పార్లమెంట్ లోని ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు పథకాల పై నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ మరియు ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించే అవగాహన సదస్సుకు, ఏర్పాట్లు, తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.స్థానిక ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు నిరుద్యోగ యువతకు, ప్రభుత్వాలు అందించే పథకాలపై పూర్తిగా అవగాహన కల్పించే విధంగా అధికారులు సమాయత్తం కావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ ప్రతినిధి వెంకట్ ,నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ మేనేజర్లు చాగంటి, సురేష్, మేనేజర్ అశ్విని కుమార్,ఎల్ డి ఎం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు చేయూతనందించిన చేగురీ శేఖర్ గౌడ్

- 8 మంది దివ్యాంగులకు ట్రై సైకిల్స్

**వారధి న్యూస్, షాద్ నగర్:** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చేగూరి శేఖర్ గౌడ్ గత 10 సంవత్సరాలుగా వికలాంగుల కోసం నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏలాంటి లాభాపేక్ష లేకుండా, ప్రత్యేకంగా 80% కంటే ఎక్కువ వైకల్యంతో బాధపడుతున్న వికలాంగులకు సహాయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.గత కొన్ని నెలలుగా, శేఖర్ గౌడ్ షాద్ నగర్ డివిజన్‌లో 1520 మంది దివ్యాంగులకు 80% వైకల్యం కలిగిన వారిని గుర్తించి తీవ్ర వైకల్యం కలిగిన వారికి బ్యాటరీ ట్రై సైకిల్స్ మరియు ట్రై సైకిల్స్ అందించడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో, హైదరాబాద్ బోయిన్ పల్లి అలింకో సంస్థను సంప్రదించి, సంస్థ నుండి విడతల వారీగా సైకిల్స్ అందించేందుకు సాయాన్ని పొందారు.2024 అక్టోబర్ 15వ తేదీ మంగళవారం, రెండవ విడతలో 7 మంది అర్హులైన వికలాంగులకు సైకిల్స్ అందించారు. అర్హత పొందిన వారు: నరసప్పగూడెం బాల్ రాజ్, చిల్కమర్రి అంజనేయులు, శ్రీను, లక్ష్మయ్య, మాదేపురం వనమ్మ, కొందుర్గ్ పల్లవి, మాదారం అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## నస్రుల్లాబాద్ పెద్ద చెరువులో చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే అనిరుధ్

**వారధి న్యూస్ మహబూబ్ నగర్,** జడ్చర్ల మండలంలోని నస్రుల్లాబాద్ గ్రామంలోని పెద్ద చెరువు దగ్గర మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి బుధవారంజడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి హాజరై గ్రామంలోని పెద్ద చెరువులోకి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువు అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని అన్నారు. త్వరలోనే పెద్ద చెరువు ను మినీ ట్యాంక్ బండ్ తయారు చేసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు.



## బొమ్మకూరు రిజర్వాయర్ లో ఉచిత చేప పిల్లల్ని విడుదల చేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా

- మత్స్యకారుల జీవితాల్లో వెలుగు నింపిన ఘనత కెసిఆర్ దే...

**వారధి న్యూస్, నర్మెట్ / జనగామ :** జనగామ నియోజకవర్గం లో ని నర్మెట మండలం లో ని, బొమ్మకూర్ రిజర్వాయర్ లో ఉచిత చేప పిల్లల కార్యక్రమం చేపట్టి, చేపపిల్లల్ని విడుదల చేసారు.గత ప్రభుత్వంలో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత కేసీఆర్దేనని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు.ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జనగామ నియోజక వర్గం బొమ్మకూరు రిజర్వాయర్ లో బుధవారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లి ప్రత్యేక పూజలు చేసి చేప పిల్లలను విడుదల చేశారు..ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాహిత సంక్షేమ పథకాలను అందిస్తుండడంతో ప్రతి ఇంట ఆనందం వెల్లివిరుస్తుందని అన్నారు. మత్స్యకారులకు ఆర్థిక భరోసా పెరిగిందని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని కులవృత్తులకు ప్రోత్సాహం అందిస్తూ వారికి అండగా నిలిచారని పేర్కొన్నారు...



## నాయిని స్వామి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి చర్లకోల లక్ష్మారెడ్డి

**వారధి న్యూస్ మహబూబ్ నగర్,** జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలం మొదం పల్లి గ్రామానికి చెందిన బాలానగర్ మండల యూత్ వింగ్ నాయకులు మొదం పల్లి మాజీ వార్డ్ సభ్యులు నాయిని స్వామి ఇటీవల ప్రమాదవసత్తు రోడ్డు ప్రమాదం లో మరణించడం జరిగింది, అందుకుగాను మాజీ మంత్రి జడ్చర్ల శాసన సభ్యులు డాక్టర్ చర్లకోలా లక్ష్మారెడ్డి పరామర్శించి వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందఅని భరోసా అందిస్తూ తన సొంతంగా 1,00,000/ రూపాయలు, బి ఆర్ఎస్ పార్టీ తరుపున 2,00,000/ ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మొదం పల్లి గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొని నాయిని స్వామి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.




## మన్ననూరులో ప్రభుత్వ భూముల్లో నిర్మాణం చేపట్టిన అక్రమ కట్టడాల కూల్చివేత

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** అమ్రాబాద్ మండలం శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూరు గ్రామంలో ప్రభుత్వ స్థలాలలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను బుధవారం గ్రామపంచాయతీ అధికారులు అధికారులు జెసిబిల సహాయంతో కూల్చివేశారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్థలాలలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని ప్రభుత్వం ప్రకటించడం అదేవిధంగా అచ్చంపేటలో హైడ్రా తరహా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని స్థానిక ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ హెచ్చరించిన అనతి కాలంలోనే అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చి వేయడం ప్రారంభించారు. మన్ననూరులో ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు వ్యాపారం నిమిత్తం ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. గతంలో వారికి హెచ్చరికలు చేసి నోటీసులు ఇచ్చినప్పటికీ వారు సొంతంగా తొలగించుకోకపోవడంతో ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని గ్రామ కార్యదర్శి భీముడు తెలిపారు .అక్రమ కట్టడాల కూల్చివేతలు ప్రారంభించడంతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన పలువురిలో భయాందోళనలు మొదలయ్యాయి. అదేవిధంగా మన్ననూరు శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి వెంట ప్రభుత్వ స్థలాల్లో అనేకమంది అక్రమదారులు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి వ్యాపార సముదాయాలను నిర్మాణం చేశారని వాటిని కూడా తొలగించాలని మననూరు గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## పత్తి కొనుగోళ్ళను ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**వారధి న్యూస్ మహబూబ్ నగర్,** జడ్చర్ల బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్ళలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అధికారులను జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆదేశించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఏం సి చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి వైస్ చైర్మన్ రాజు గౌడ్, డైరెక్టర్లు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఆర్టీసీ బస్సులో 9 తులాల బంగారు చోరి

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన కారా బండి మహేష్ భార్య నాగర్ కర్నూల్ బస్టాండ్ లో బస్సు ఎక్కి కల్వకుర్తి వెళ్తుండగా కొల్లాపూర్ చౌరస్తా దగ్గర కుమారుని టికెట్ కోసం చూసుకోగా తొమ్మిది తులాల బంగారు చోరీకి గురైనట్లు ఆమె తెలిపారు. బాధితమైన నాగర్ కర్నూల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలను విజయవంతం చేయండి

- జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగుపరచడంలో నా పాత్ర అనే అంశంపై గూగుల్ ఫామ్ లో వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బుధవారం తెలిపారు . జిల్లాలోని విద్యార్థులు మరియు సాధారణ పౌరులతో పాటు ఎవరైనా వ్యాసరచన పోటీలలో పాల్గొని అప్లోడ్ చేయవలసి ఉంటుందని ప్రతిభ కనబరిచిన వ్యాసరచ



డానికి బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు . వ్యాసరచన అంశాన్ని అప్లోడ్ చేసేందుకు ఈనెల 27వ తేదీ చివరి తేదీ అని తెలిపారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com






## వినియోగదారుల చట్టాల పై అవగాహన

- **చట్టాలపై అవగాహన కల్పించిన డిఫెన్స్ లీగల్ ఎడ్ కౌన్సిల్**

**వారధి న్యూస్, వనపర్తి:** మహాత్మా జ్యోతిబా పూలే, బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం వనపర్తి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో డిఫెన్స్ లీగల్ ఎడ్ కౌన్సిల్ యొక్క జి. ఉత్తరయ్య వినియోగదారుల చట్టం గురించి వివరిస్తూ, సరుకులు కొనుగోలు చేసేముందు వాటి ధరలు మరియు ఎక్స్పైరీ డేట్లను పరిశీలించాలని సూచించారు. అంతేకాక, అధిక ధరలకు వస్తువులు అమ్మినప్పుడు టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. మోటార్ వెహికల్స్ చట్టాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగలేడు డిఫెన్స్ కౌన్సిల్ ఎం శ్రీదేవి, ఎం లక్ష్మి మరియు కళాశాల ప్రిన్సిపల్ వై శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## సిసిఐ కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరువాలి

- **పత్తికి మద్దతుధర గుజరాత్ తరహా తెలంగాణలో ఇవ్వాలి.**
- **సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి**
- **మాజీ వ్యవసాయ శాఖ మంత్రి.**




**వారధి న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణ భవన్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని, గుజరాత్ లో క్వింటాలు ఇస్తున్న మద్దతుధర తెలంగాణ రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేసిన మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గుజరాత్ లో ఉన్న పత్తి ధర తెలంగాణ రైతుల పత్తికి ఇవ్వాలి తెలంగాణ నుండి ఉన్న కేంద్రమంత్రులు ఇద్దరూ ఈ విషయంలో చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేస్తున్నాం రాష్ట్రంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇంకా ఎందుకు తెరవలేదు ?వానల మూలంగా పత్తిని స్టాక్ పెట్టుకోలేక తెలంగాణ రైతులు సతమతం అవుతున్నారు దళారుల చేతుల్లోకి రైతులను నెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదుదిక్కులేని పరిస్థితులలో రైతులు మద్దతుధర క్వింటాలు పత్తికి రూ.7521 కి బదులు రూ.5500కు అమ్ముకుంటున్నారు గుజరాత్ రాష్ట్రంలో క్వింటాలు పత్తి రూ.8257కు కొంటున్నారు గుజరాత్ పత్తికి రూ.8257 ఎందుకు ? తెలంగాణ రైతులకు రూ.7521 ఎందుకు ?గుజరాత్ రైతులే దేశభక్తులా ? తెలంగాణ రైతులు దేశ అభ్యున్నతికి కృషిచేయడం లేదా ?రాష్ట్రానికి ఉన్న ఇద్దరు కేంద్రమంత్రులు ఎన్నడైనా రైతుల సమస్యల మీద దృష్టిపెట్టారా ? కేసీఆర్ గారి మీద విమర్శలు చేయడం తప్ప మీరు ఇంత వరకు ఏం చేశారు ? ఇద్దరు కేంద్ర మంత్రులు వెంటనే గుజరాత్ లో ఉన్న పత్తి ధర తెలంగాణకు అందేలా కృషిచేయాలి. వెంటనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిపించాలి మూసీ ప్రక్షాళనకు అడ్డొస్తే పండబెట్టి తొక్కుతా .. దగ్గరుండి పనిచేయిస్తా అంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో రెండున్నర కోట్ల మంది ఆధారపడ్డ వ్యవసాయ రంగం పట్ల బాధ్యత లేదా ? రైతుబంధు జాడలేదు, క్వింటాలుకు రూ.500 వడ్ల బోనస్ ఊసులేదు .. పండిన ధాన్యానికి బోనస్ కోసం వడ్ల నాణ్యత పేరుతో ఆంక్షలు విధిస్తున్నారుఒక్కనాడైనా తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం సీఎం, వ్యవసాయ శాఖా మంత్రి డిమాండ్ చేశారా ?లాంగ్ స్టేబుల్ పేరుతో గుజరాత్ పత్తి నాణ్యత అంటున్నారు .. తెలంగాణ పత్తి కన్నా గుజరాత్ పత్తి నాణ్యమైనది కాదని సీసీఐ పేర్కొన్నదిపేదల ఇండ్లు కూల్చడమే ఈ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యతనా ? ప్రభుత్వాన్ని నడపడానికి అప్పులు తెస్తున్నాం అని చెబుతూ .. రూ.లక్షన్నర కోట్లతో మూసీని ప్రక్షాళన చేస్తాం అని చెప్పడం దేనికి సంకేతం ?ప్రభుత్వమే పేదల ఇండ్లను కూలగొడుతూ నేరపూరిత చర్యలకు దిగడం సమంజసమేనా ?నాలుగేళ్ల పిల్లలు కూడా తమ పుస్తకాలు తీసుకుంటాం అని కోరితే రాతిగుండెలు కూడా కరుగుతాయి .. కానీ ఈ ప్రభుత్వం మాత్రం కరగడం లేదుప్రజల ఇండ్లు కూల్చడం విప్లవచర్యనా ? రేవంత్ ను విప్లవకారుడుగా పోల్చడం అవివేకంవిధ్వంసపాలకుడుగా రేవంత్ చరిత్రలో నిలబడతాడు కేసీఆర్ ప్రభుత్వం మీద తొమ్మిదిన్నరేళ్లలో ఒంటికాలితో లేచిన మేధావులు ఇప్పుడెందుకు నోరుమూసుకున్నందుకు సిగ్గుతో తలవంచుకోవాలి .. ప్రజల జీవితాలు అతలాకుతలం అవుతుంటే వారు ఎక్కడ ఉన్నారు ?బీఆర్ఎస్ పార్టీ హయాంలో ప్రభుత్వ మద్దతు ధరకు మించి ప్రైవేటులో పత్తిని రైతులు అమ్ముకున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వంలో కేవలం 44 లక్షల ఎకరాలలో పత్తి సాగు చేశారు .. బీఆర్ఎస్ హయాంలో రైతులను ప్రోత్సహించి 60లక్షల పైచిలుకు ఎకరాలకు పత్తి సాగును తీసుకెళ్లాం పత్తి విస్తీర్ణం పెంపునకు తెలంగాణ ఏర్పాటు తర్వాత తీవ్రంగా కృషిచేశాం

తెలంగాణ పత్తి నాణ్యతతో సీసీఐ ఖ్యాతి పెరిగింది అని .. సీసీఐకి వచ్చిన అధిక లాభాలు తెలంగాణ పత్తి నాణ్యత మూలంగానే లభించాయని సాక్షాత్తూ సీసీఐ అధినేత గతంలో చెప్పారుతెలంగాణ భవన్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని, గుజరాత్ లో క్వింటాలు ఇస్తున్న మద్దతుధర తెలంగాణ రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేసిన మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పాల్గొన్న మాజీ కార్పోరేషన్ చైర్మన్ రజనీ సాయిచంద్, బీఆర్ఎస్ నేత కురువ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలి

- **ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్**

**వనపర్తి:** రాష్ట్ర ప్రభుత్వానికి "పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలి," అని డిమాండ్ చేశారు. అర్జున్ మాట్లాడుతూ, "సంవత్సరాల తరబడి ఈ పథకాలు విడుదల కాకుండా 7,500 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల జీవితాలను దారితప్పించుకుంటోంది" అని మండిపడ్డారు. "ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్స్ పథకాలను నిర్లక్ష్యం చేయడం విద్యార్థుల హక్కులను దూరం చేస్తోంది," అని ఆయన అన్నారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు సర్టిఫికెట్స్ లేకుండా ఒత్తిడికి గురవుతున్నారని, "ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు" అని అన్నారు."ఉన్నత విద్యకు అవకాశాలు ఉన్నా కూడా సర్టిఫికెట్స్ లేక విద్యార్థుల జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడుతున్నాయి," అని అర్జున్ అన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు రావడం లేదు,




కానీ ప్రభుత్వం నూతన హామీలతోనే వ్యవహరించడం సబబు కాదని ఆయన పేర్కొన్నారు. అయితే, "రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరిని కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం," అని హెచ్చరిస్తూ, ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఆశయం కోసం ఎమ్మెల్యేను అయ్యాను..
# అచ్చంపేట ను అభివృద్ధిలో అగ్రగామిలో నిలుపుతా

- అచ్చంపేట నియోజకవర్గం గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ
- 123 కోట్ల నిధులు మంజూరు
- పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత రహదారులు ఏర్పాట్లు
- అచ్చంపేట నియోజకవర్గంలో త్వరలో జాతీయ బ్యాంకుల ఏర్పాటు
- సెల్ ఫోన్ టవర్ ఏర్పాటుకు తగు చర్యలు పర్యావరణ అనుమతులు మంజూరు
- కృష్ణా నదిపై బ్రిడ్జి ఏర్పాటు కొరకు త్వరలోనే ఏపీ,తెలంగాణ ఎమ్మెల్యేల బృందంతో ఢిల్లీకి
- అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా లక్ష్యం
- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ





**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో** ఆశయంతోనే ఎమ్మెల్యే కాగలిగాను అచ్చంపేట నియోజకవర్గ ప్రజలు కోరుకునే విధంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా ముందున్న కర్తవ్యం అని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు బుధవారం స్థానిక అంబేద్కర్ ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో అచ్చంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా వెనికికి నెత్తివేయబడిందని అన్నారు. ప్రజల ఆశీస్సులతో ఓ ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చిన నేను స్థానికుడిగా నిరంతరం ప్రజల అభ్యున్నతి ఈ ప్రాంత అభివృద్ధి కోసం పాటుపడతానని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అచ్చంపేట నియోజకవర్గం అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గం లో కొత్తగా నేషనల్ బ్యాంకులను ఏర్పాటు చేయడానికి లింగాల మండలం అంబటిపల్లి, ఉప్పునుంతల మండలం వెల్టూర్, అచ్చంపేట మండలం సిద్ధాపూర్ అయినోలు, వంగూరు మండలం ఎల్లమ్మ రంగాపూర్, గ్రామాల్లో ఎస్బిఐ బ్యాంకులను ఏర్పాటు చేయడానికి సంబంధిత లీడ్ బ్యాంకు మేనేజర్ ను కలవడం జరిగిందని వారు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. త్వరలో బ్యాంకులను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తామన్నారు. టెలిఫోన్ సిగ్నల్స్ లేని ప్రాంతాల్లో పదర మద్దిమడుగు, మారడుగు ఉడిమిళ్ళ బల్మూరు మండలం మహాదేవపూర్ అచ్చంపేట మండలం బక్క లింగాయపల్లి ప్రాంతాల్లో కొత్తగా సెల్ టవర్లను ఏర్పాటు చేసి త్వరలో ప్రారంభిస్తామని అందుకు నల్లమల్ల అడవి ప్రాంతంలో అటవీ శాఖ తో ఉన్న అన్ని అడ్డంకులను తొలగించామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధపరిచి అచ్చంపేట నియోజకవర్గానికి 123 కోట్ల నిధులను బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని అందుకు సీఎం రేవంత్ రెడ్డి మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్ నుండి 15 కోట్ల నిధులు రోడ్లకు మంజూరు అయ్యాయని బల్మూరు మండలం పిడబ్ల్యు రోడ్ వీరమ్ రామోజీ పల్లి మీదుగా లింగాల వరకు మూడు కోట్ల నిధులు. ఉప్పునుంతల నుండి పలక పల్లి వరకు నాలుగున్నర కోట్ల నిధులు. అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ తండా నుండి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వరకు మూడు కోట్ల 50 లక్షలు. చారగొండ మండలం చారగొండ నుండి రాంపూర్ వరకు మూడున్నర కోట్లు, అచ్చంపేట మండలం లో ఐనోల్ నుండి కన్య తాండ వరకు ఎనిమిది కిలోమీటర్లు 15 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద 11 కోట్ల 50 లక్షలు త్వరలో మంజూ కానున్నాయని తెలిపారు. ఆర్ అండ్ బి సర్వారెడ్డిపల్లి గేటు తుమ్మలపల్లి కొండారెడ్డిపల్లి తిమ్మరాజు పల్లి నుంచి కల్వకుర్తి మెయిన్ రోడ్డు వరకు 36 కోట్ల 80 లక్షలు. కల్వకుర్తి శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి నుండి కొండారెడ్డిపల్లి పోల్కంపల్లి వరకు 16 కోట్ల నిధులు మంజూరై పనులు ప్రారంభించామని తెలిపారు. ఉల్పర మొల్గర మధ్యన డిండి వాగు పై బ్రిడ్జి నిర్మాణం కోసం 37 కోట్ల నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఎం ఆర్ ఆర్ 15 కోట్ల నిధులు త్వరలో రానున్నాయని ఆయన తెలిపారు. పదర మండలం మద్దిమడుగు కృష్ణానది ఏపీ మాచర్ల వరకు వంతెన నిర్మాణం కొరకు సీఎం రేవంత్ రెడ్డి వద్ద 770 కోట్ల నిధులతో ప్రతిపాదనలు పెట్టడం జరిగిందని ఆయన తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## చివరి గింజ వరకూ వరిని కొంటాం..

- **రైతులు మోసపోకుండా చర్యలు తీసుకుంటాం**
- **ముందస్తుగానే వరి కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేస్తాం**
- **జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడి**

**వారధి న్యూస్ మహబూబ్ నగర్,** ఖరీఫ్ సీజన్ లో రైతులు పండించిన వరి ధాన్యంలో చివరి గింజ వరకూ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేసారు. ఇందిర క్రాంతి పథంకు చెందిన మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఇప్పటి నుంచే ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని వెల్లడించారు.జడ్చర్ల మండలంలోని నస్రుల్లాబాద్ లో బుధవారం ఐకేపీకి చెందిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగానే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, వరి పండించే రైతులు మధ్యదళారుల చేతుల్లో మోసపోయి తక్కువ ధరలకే తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకోకూడదనే లక్ష్యంతో మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని చెప్పారు. ఈ ఏడాది సన్న ధాన్యం క్వింటాల్ కు రూ.2320 లతోపాటుగా రూ.500 బోనస్ కూడా ఇస్తోందని చెప్పారు. దొడ్డు ధాన్యానికి రూ.2300 ధర చెల్లిస్తోందని తెలిపారు. గత ఏడాదిలో జడ్చర్ల నియోజకవర్గంలోని జడ్చర్ల, నవాబుపేట, బాలానగర్, రాజాపూర్, మిడ్జిల్, ఉర్కొండ మండలాల్లో రూ.36.33 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు. ఈ ఏడాది కూడా ధాన్యం కొనుగోలుకు 40 కు పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. బాలానగర్ మండలంలో చిన్నరేవల్లి, బాలానగర్, హేమాజీపూర్, మదంపల్లి, బాలానగర్ సింగిల్ విండో సొసైటీ, జడ్చర్ల మండలంలో బాదేపల్లి, నస్రుల్లాబాద్, కోడ్గల్, పెద్దఆదిరాల గ్రామాల్లోనూ, మిడ్జిల్ మండలంలో భైరంపల్లి, చిలుపూరు, దోనూరు, కంచన్ పల్లి, కొత్తూరు, మల్లాపూర్, మసిగుండ్లపల్లి, మిడ్జిల్, మున్ననూరు, వల్లభురావుపల్లి, వెలుగొమ్ముల, వేముల, వాడ్యాల గ్రామాల్లోనూ, నవాబుపేట మండలంలో చౌడూరు, గురుకుంట,కాకర్లపహాడ్, కారుకొండ, కొల్లూరు, కూచూరు, లింగంపల్లి, లోకిరేవు, నవాబుపేట, ఇప్పటూరు, రుద్రారం, పోమాల్ తదితర గ్రామాల్లోనూ, రాజాపూర్ మండలంలో ఈద్గాన్ పల్లి, రాఘవాపూర్, రాజాపూర్, రంగారెడ్డి గూడ గ్రామాల్లోనూ, ఉర్కొండ మండలంలో జకినాలపల్లి, బొంరాస్ పల్లి, ఉర్కొండపేట గ్రామాల్లోనూ వరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. ప్రభుత్వం ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకాలు సక్రమంగా ఉంటాయని, ఎంఎస్పి ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తారని, అందుకే రైతులందరూ ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని అనిరుధ్ రెడ్డి కోరారు. ధాన్యం అమ్మకానికి రావడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ రైతులందరికీ ఈ కేంద్రాలకు సంబంధించిన సమాచారం ఉండాలన్న లక్ష్యంతో ముందుగానే ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ తంగెళ్ల జ్యోతి, మార్కెట్ వైస్ చైర్మెన్ రాజేందర్ గౌడ్, జడ్చర్ల ఎమ్మార్వో, ఎంపిడీఓ, ఎఇఓ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సునీత, ఐకేపీ ఏపీఎం మాల్యా నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ స్వరాజ్యలక్ష్మి**

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** కంటి చూపుతో బాధపడే రోగులు ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ స్వరాజ్యలక్ష్మి కోరారు బుధవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ కార్యాలయంలోని రూమ్ నెంబర్ 102 లో ఉచిత కంటి వైద్య ఆపరేషన్ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో కంటిచూపు సమస్యతో అనేకమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కంటి పరీక్షల అనంతరం రామ్ రెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందని వీరికి రవాణా సౌకర్యంతో పాటు భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి బుధ మరియు శుక్రవారం కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వెంకట్ దాస్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేషన్ నరసింహా, హెచ్ ఇ ఓ రాపోలు శ్రీనివాస్ తో పాటు నేత్రాధికారి కొత్త బాలాజీ తోపాటు వెంకటస్వామి, రమేష్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ కుమార్, సుకుమార్ రెడ్డి, ప్రకాష్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.




## రైతులను ఆదుకోనేందుకే కొనుగోలు కేంద్రాలు

- **ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తెలిపారు.బుధవారం నాగర్ కర్నూలు నియోజకవర్గం లోని తాడూరు మండలం చర్ల ఇటిక్యాల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గింజలు కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యం చెందకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి అమ్ముకోవాలని సూచించారు. సన్న వడ్లకు 500 బోనస్ ప్రకటించిన విధంగానే ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. రైతుల ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అధికారులు రైతులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## దేవాలయ అభివృద్ధికి 64 వేల విరాళం

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** అచ్చం పేట మండలం రంగాపూర్ నల్లమల కొండల్లో వెలసిన శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన అభివృద్ధికి హైదారాబాద్ ,వనస్థలిపురం ప్రాంతానికి చెందిన. డా, మధుమూర్తి గాయత్రి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు,దేవాలయ అభివృద్ధికి డా,,మధుమూర్తి దంపతులు 64000 (అరవై నాలుగు వేల రూపాయలు) విరాళం ఇచ్చారు,వారి కుటుంబానికి ఆ ఉమామహేశ్వర స్వామి కరుణ కటాక్షం ఎల్ల వేళల వుండాలని దేవస్థాన చైర్మన్ బీరం మాధవ రెడ్డి తో మాట్లాడి విరాళం ప్రకటించిన మదుమూర్తి దంపతులకు ఆలయ డైరెక్టర్ లు పవన్ ,సైదులు,ఆలయ అధికారులు,అర్చకులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు.

## మందకృష్ణను విమర్శించేవారికి స్థాయి లేదు

- **కందుకూరు సోమన్న**

**తుంగతుర్తి:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన మాల మహానాడు సమావేశంలో, మాదిగ నేత మందకృష్ణ మాదిగను కక్ష సాధించడానికి కొన్ని నీచమైన వ్యాఖ్యలు చేసిన జ్ఞానసుందర్‌పై ఎం ఆర్ పి ఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు కందుకూరు సోమన్న తీవ్రంగా స్పందించారు.సోమన్న, "మంద కృష్ణ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను మేం ఖండిస్తున్నాం. ఇలాంటి మాటలు మాట్లాడేవారు తుంగతుర్తి నియోజకవర్గానికి అనర్హులు," అని హెచ్చరించారు. ఆయన ఈ వాక్యాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు, లేకుంటే తీవ్ర పరిణామాల చిగుర్లు ఉంటాయని చైతన్యం చేశారు. సోమన్న మాదిగల ఉద్యమాన్ని చరిత్రలో ఎంతో ముఖ్యమైనదిగా పేర్కొన్నారు, "మా ఉద్యమం కులం పేరు మీద కాదు, మానవత్వం కోసం," అని స్పష్టం చేశారు. "రాజకీయ అవకాశాల కోసం మాట్లాడేవారు రాజకీయం చేసేటప్పుడు



జాగ్రత్తగా ఉండాలి," అని ఆయన జ్ఞానసుందర్‌కు చురకలు వేస్తూ చెప్పారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com

# Movie Time మూవీ టైమ్



## ‘గగన మార్గన్’ ఫస్ట్ లుక్ విడుదల

నటుడిగా, దర్శకుడిగా, లిరిసిస్ట్‌గా, సంగీత దర్శకుడిగా తన సత్తాను చాటుకున్నారు విజయ్ ఆంటోని. మల్టీ టాలెంటెడ్ అయిన విజయ్ ఆంటోనీ డిటెక్టివ్ ఫిక్షన్ ప్రపంచంలోకి అందరినీ తీసుకెళ్లేందుకు గ్రిప్పింగ్ మర్డర్ మిస్టరీ-క్రైమ్ థ్రిల్లర్‌తో రాబోతున్నారు. విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ బ్యానర్‌పై మీరా విజయ్ ఆంటోని సగర్వంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ మూవీ టైటిల్‌ను తాజాగా రివీల్ చేశారు. ‘గగన మార్గన్’ అంటూ రిలీజ్ చేసిన టైటిల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో విజయ్ ఆంటోని రెండు రకాలుగా కనిపించారు. గాయపడి ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన విజయ్ లుక్ కొత్తగా ఉంటే.. నీటి అడుగు బాగాన ఉన్న వ్యక్తి పోస్టర్ కూడా ఇందులో కనిపిస్తోంది. "అట్టకత్తి", "జీడ", "సూదు కవ్వుం", "ఇంద్రు నేత్ర నాళై", "తేకడి", "ముండాసుపట్టి", "కదలుం కాదందు పోగుం", "ఏ1", "మాయవన్" వంటి చిత్రాలకు ఎడిటర్‌గా పేరు తెచ్చుకున్న లియో జాన్ పాల్.. ‘గగన మార్గన్’తో దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. లియో జాన్ పాల్ 2013లో "ఇదర్‌కుతానే ఆసైపట్టై బాలకుమార" చిత్రానికి ఉత్తమ ఎడిటర్‌గా తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డును గెలుచుకున్నారు. ‘గగన మార్గన్’ అన్నివర్గాల వారిని ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ చిత్రాన్ని త్వరలో థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



## ‘L2 ఎంపురాన్’ జయేద్ మసూద్ ఫస్ట్ లుక్ పోస్టర్

‘లూసిఫర్’ 2019లో విడుదలై బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సీక్వెల్‌గా ‘L2 ఎంపురాన్’ రాబోతోంది. స్టార్ హీరోలతో భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మించే చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తోంది మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ హీరోగా రాబోతోన్న ఈ చిత్రంలో సౌత్ స్టార్‌లు నటిస్తున్నారు. తొలి భాగం హిట్ కావటంతో సినిమాపై ఎలాంటి అంచనాలున్నాయో ముందుగానే అంచనా వేసిన మేకర్స్ ఎక్స్‌పెక్టేషన్స్‌ను మించేలా సినిమాను నిర్మిస్తున్నారు. మోహన్ లాల్, వెర్సటైల్ యాక్టర్, డైరెక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న మూడో చిత్రం కావటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశన్నంటాయి. మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా ‘L2 ఎంపురాన్’ లో ఖురేషి అబ్రమ్‌గా సూపర్‌స్టార్ లుక్‌ను విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక ఇప్పుడు పృథ్వీరాజ్ సుకుమార్ బర్త్ డే సందర్భంగా ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో ఖురేషి అబ్రమ్‌కు రైట్ హ్యాండ్‌లా జయేద్ మసూద్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమార్ కనిపించనున్నారు. తాజాగా రిలీజ్ చేసిన జయేద్ మసూద్ కారెక్టర్ ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఎంపరర్ జనరల్ అంటూ జయేద్ మసూద్ పాత్రను పరిచయం చేశారు. ఈ చిత్రంలో టోవినో థామస్, మంజు వారియర్, నందు, సానియా అయ్యప్పన్ తదితరులు మరోసారి వారి పాత్రలతో మెప్పించబోతున్నారు.

## డెనిమ్ షార్ట్స్ లో అందాల ఈషా



సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉండే నటి ఈషా రెబ్బా, తాజాగా షేర్ చేసిన ఫోటోలు మరోసారి అభిమానులను ఆకట్టుకున్నాయి. "Me and my warm mirror vibes" అంటూ క్యాప్షన్ పెట్టిన ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఫోటోల్లో ఈషా సింపుల్ టీషర్ట్, డెనిమ్ షార్ట్ ధరించి, తన ఫిట్‌నెస్ పై కృషిని స్పష్టంగా చూపిస్తున్నారు. ఆ మధ్య జిమ్ లో వర్కౌట్స్ చేసిన తర్వాత తీసిన కొన్ని ఫొటోలు బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. ఫోటోలలో ఆమె ముఖంపై చెమట కనబడటం, ఫిట్ గా ఉండేందుకు ఆమె ఎంత కష్టపడుతున్నారో చెప్పకనే చెబుతోంది. ఇక ఇప్పుడు అమ్మడు మరోసారి ఆ రేంజ్ లో లెగ్స్ అందాలతో షాక్ అయ్యేలా స్టిల్ ఇచ్చింది. ఈషా తన అందంతో పాటు ఫిట్‌నెస్ విషయంలో కూడా ఎంతో కసరత్తులు చేస్తోంది. తెలుగు అమ్మాయి అయినప్పటికీ, తన అందంతోనూ, టాలెంట్ తోనూ ఆమె తమిళం సహా ఇతర భాషల్లో కూడా అవకాశాలు అందుకుంటోంది. వెబ్ సిరీస్ లలో నటిస్తూ కొత్త అవెన్యూస్ ను అన్వేషిస్తోంది. అయితే మంచి కాంటెంట్ ఉన్న క్యారెక్టర్ దొరికితే గ్లామరస్ పాత్రలు చేయడానికి ఇబ్బంది లేదని అమ్మడు గతంలోనే క్లారిటీ ఇచ్చింది. ఇక ఇప్పుడు ఫొటోలతో స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. ఈషా ఆమధ్య "దయా" అనే వెబ్ సిరీస్ లో డీ గ్లామర్ లుక్ లో కనిపించి ప్రశంసలు అందుకుంది. అందులో నిండు గర్భిణిగా నటించి, తన నటనలో ఉన్న వైవిధ్యాన్ని మరోసారి నిరూపించుకుంది. ఇక ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఈషా రెగ్యులర్ గా ఫోటోలను షేర్ చేస్తూ, అభిమానులను మరింత దగ్గరగా చేసుకుంటుంది. ఈ సారి న్యూ లుక్ లో ఆమె సింప్లిసిటీతో పాటు, ఫిట్‌నెస్ పై ఉన్న ప్రేమను కూడా మరోసారి నిరూపించింది.